
కంచరపాలెం బీఆర్‌టీఎస్ సబ్ వే రైతుబజారు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


మళ్ల సూరి వీధి రహదారిలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఊర్వశి కూడలిలో ఫుట్‌పాత్‌పై దిమ్మ కట్టేసి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


దుర్గానగర్ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే చిరుతిండి వ్యాపారం

భయపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- రాకపోకలకు భయపడుతున్న పాదచారులు, వాహనదారులు
- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

కంచరపాలెం : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పాదచారులు, వాహనదారులు హడలిపోతున్నారు. ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాలకు దూరంగా, ఎవరికీ అందనంత ఎత్తులో ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లను... నిర్లక్ష్యంగా బీఆర్‌టీఎస్ ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ 54, 55, 56, 57 వార్డుల్లో విస్తరించిన కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధిలోని తోటవీధి, వివేకనందనగర్, మళ్లసూరి వీధి, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, కంచరపాలెం రైతుబజారు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు స్థానికులను భయపిస్తున్నాయి. ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని గృహ సముదాయాలకు, నూతన దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారిపై ప్రమాదభరితంగా ఏర్పాటు చేశారు. అటుగా వెళ్లే వాహనాలు ఆ ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు, పాదాచారులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రభుత్వ స్తంభాలకు స్థానిక దుకాణాల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా... అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

నిత్యం బిక్కుబిక్కుమంటూనే...

గత ఏడాది కంచరపాలెం రైతుబజారు ప్రధాన ద్వారం పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తెగిపడడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏ ప్రమాదమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటి నుంచి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సమీప దుకాణాల ట్రాన్స్‌ఫార్మర్లను సొంత స్థలంలో ఏర్పాటు చేసుకోని యాజమానులపై విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో... ఇదే అదునుగా భావించిన చిల్లర వర్తకులు బీఆర్‌టీఎస్ రహదారులపైనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని వ్యాపారాలు సాగిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ స్తంభాలను ఫుట్‌పాత్‌లకు ఆనుకుని దుకాణాలపై ఏర్పాటు చేయాల్సి వుండగా... స్థానిక ప్రజాప్రతినిధి అండతో బీఆర్‌టీఎస్ సబ్ వేలో స్తంభాలు ఏర్పాటు చేసి రహదారులను కుదించేశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే చిల్లర వర్తకుల దుకాణాలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు శ్రద్ధ చూపుతున్నారని... ఏపీఈపీడీసీఎల్ అధికారులు బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నిత్యం భయపడుతున్నాం



బీఆర్‌టీఎస్‌లో పలు దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేసేశారు. అసలే రోడ్లు కుదించుకుపోయాయి. అటుగా వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటుంది. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలి.

– డి.దాస్, వాహనదారుడు, జ్ఞానాపురం

నడవడానికి ఇబ్బందికరం



స్థానిక దుకాణాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసేశారు. అయినా టౌన్‌ప్లానింగ్, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోలేదు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

– సీహెచ్ ఈశ్వరరావు, ఐటీఐ జంక్షన్, కంచరపాలెం

పేకాట శిబిరంపై దాడి

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో పేకాట శిబిరంపై ఐదో పట్టణ పోలీసులు దాడి నిర్వహించారు. మంగళవారం మురళీనగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను గుర్తించి అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్

సీతంపేట : తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని అక్కయ్యపాలెంలోని విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యులు సుధీర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రతి సచివాలయంలో వ్యాక్సినేషన్‌కు ఎంతమంది అర్హులో గుర్తించారు. ఇప్పటి వరకు ఎంత మందికి వ్యాక్సిన్ వేశారు... ఇంకా ఎంత మందికి టీకాలు వేయాలి... తదితర విషయాలపై సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో చర్చించారు. అలాగే లెప్రసీ సర్వే, త్వరలో డీవార్మింగ్ మాత్రల పంపిణీ, క్యాన్సర్ సర్వేపై చర్చించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ ఫీవర్ సర్వే, దోమల నియంత్రణకు పటిష్టంగా ఫ్రైడే... డ్రై డే అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

నేడు వ్యాస రచన పోటీలు

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'మన స్వాతంత్ర్యం సమరయోధుల త్యాగఫలం'అనే అంశంపై 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 1, 2, 3 తరగతుల చిన్నారులకు ఆటల పోటీలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: సూర్యానగర్ జాతీయ రహదారిలో కొలువు దీరిన యోగ సిద్ధాంజనేయుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రధానార్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయం ప్రకారం ఉదయాస్తమాన సేవలు చేశారు. అనంతరం స్వామికి సింధూరంతో పూజలు జరిపారు. శ్రీరామ అష్టోత్తరం చదివి వినిపించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరాకాండం పఠించారు.

సా..గుతున్న కల్వర్టు పనులు


రామకృష్ణానగర్‌లో జరుగుతున్న కల్వర్టు పనులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం పక్కనున్న రహదారిలో కల్వర్టు ఆధునీకరణ పనులు సాగుతున్నాయి. ఈ పనుల కారణంగా ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రామకృష్ణానగర్ నుంచి శంకర మఠం రోడ్డుకు రావడానికి చుట్టూ తిరిగి ఇటు లలితానగర్ లేదా అటు 80 అడుగుల రోడ్ మీదుగా రావాలివస్తోంది. సుమారు కిలో మీటరు దూరం ప్రయాణించాల్సి వస్తోందని, 15 రోజులుగా ఇబ్బందిపడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

కృష్ణా కళాశాలలో హిరోషిమా డే


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ప్రపంచ హిరోషిమా డేను మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ న్యూక్లియర్ పవర్‌ను శాంతియుతంగా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఎంతైనా అవసరమన్నారు. హిరోషిమా బాంబు దాడి సంఘటనలతో కూడిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది.

వరద బాధితులను ఆదుకోండి

దాబాగార్డెన్స్: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో బాధిత కుటుంబాలకు విరాళాలిచ్చి ఆదకుందామంటూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మంగళవారం విరాళాలు సేకరించింది. ఈ సంసదర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనలో అనేక మంది మృత్యువాత పడగా, వేలాది మంది నిరాశ్రులయ్యారని, దీనిని జాతీయ విపత్తుగా భావించి కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల కొరడా



తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో దుకాణదారులను హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో హోటల్, దుకాణాల నిర్వాహకులకు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు హెచ్చరికలు జారీ చేశారు. దుకాణాల వద్ద వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం 'రహదారులపై రాంగ్ పార్కింగ్'శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ భేష్


స్కేటింగ్ విద్యార్థులతో ఏసీపీ నరసింహమూర్తి

మురళీనగర్: మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ చాలా బాగుందని నార్త్ ఏసీపీ అన్నెం నరసింహమూర్తి అన్నారు. బుధవారం ఆయన పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా రూపొందించిన వాకింగ్ ట్రాక్, బుద్ధుడి విగ్రహం, ఇతర సౌకర్యాలతో పాటు పార్కుకు అనుబంధంగా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు. స్కేటింగ్ రింక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు రోల్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విషయాన్ని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆయనకు వివరించారు. పార్కును సోలార్ విద్యుత్ ప్లాంటు ద్వారా నడిపిస్తున్నట్లు చెప్పారు. స్థానిక వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఏసీపీ నరసింహమూర్తిని ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో ఐదో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ దివ్యభారతి, డిస్ట్రిక్ట్–101 పూర్వ అధ్యక్షురాలు యు.శుభ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి, కార్యదర్శి జయ, తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో పరిశీలన


జై భారత్‌నగర్‌లో చెత్త పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం : కొండవాలు ప్రాంతాల్లో జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారులు మంగళవారం పర్యటించారు. జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాలైన ఇందిరానగర్, జై భారత్‌నగర్, శ్రీనివాస్‌నగర్‌లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని అందిన ఫిర్యాదులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత జోన్ – 5 పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు సునీల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ దీపాల సమస్య, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తదితర సమస్యలు పరిష్కరించాలని నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గంకల అప్పారావు, మహేష్, శంకరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అభ్యుదయ ఆర్ట్స్(హైదరాబాద్) సంయుక్తంగా ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి–డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏయూ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జి.కె.డి.ప్రసాద్, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై చలో ఢిల్లీ


ఆల్ పెన్షనర్స్ ధర్నాలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు షణ్ముగం

మురళీనగర్: ఆల్ పెన్షనర్స్ సమస్యలపై ఢిల్లీలో మంగళవారం జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో విశాఖ ఆల్ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు హాజరైనట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో విశాఖ జిల్లా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నామని పేర్కొన్నారు. కనీస పింఛన్‌ను రూ.9 వేలతో పాటు డీఏ ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని, పింఛన్‌దార్లకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే ప్రయాణానికి రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశామన్నారు. ఈ శిబిరాన్ని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, డీఎంకే రాజ్యసభ సభ్యుడు షణ్ముగం, సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బిట్టాస్ సందర్శించినట్లు చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు గుర్తించారు. మృతుని వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ, లేదా 96661 22722, 94406 27547కు తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

వేడుకగా మంగళగౌరీ వ్రతం


మంగళగౌరీ వ్రతం చేస్తున్న మహిళలు

మర్రిపాలెం : శ్రీగౌరీ సేవా సంఘం 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మంగళగౌరీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు 50వ వార్డు మురళీనగర్ వైశాఖి స్కేటింగ్ పార్కు వద్ద కార్యక్రమం నిర్వహించారు. శ్రీ గౌరీ సేవా సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మళ్ల రమణ, ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి వెంకటరావు పర్యవేక్షణలో నిర్వహించిన వ్రతంలో అర్చకుడు కేవీఎల్ నరసింహం మహిళలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. ఈ పూజకు సంబంధించి ముందు రోజు (సోమవారం) అమ్మవారిని కంచరపాలెం నుంచి మురళీనగర్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పిల్లా జగన్నాథరావు, కాల రామారావు, బొడ్డేటి శంకరరావు, పాలిమేర నాగేశ్వరరావు, సుబ్బారావు, ప్రతాప్, దాడి ఈశ్వరరావు, ఝాన్సీ, సుభాషిని పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ


డ్రెయిన్‌లో దోమల లార్వాను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్

సీతంపేట : వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా దోమల నియంత్రణకు ప్రజలంతా సహకరించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ కోరారు. దోమలు పెరిగే ప్రదేశాలపై ప్రజలకు, మహిళలకు, పొదుపు సంఘాల ప్రతినిధులకు వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బుల్లయ్య కళాశాల ఏరియా, సీతంపేట, రేసపువానిపాలెంలో మంగళవారం ఉదయం ఫ్రైడే డ్రైడే అమలు తీరును ఆయన పరిశీలించారు. బుల్లయ్య కళాశాల గోడకు ఆనుకుని ఉన్న డ్రెయిన్‌లో పలుచోట్ల వర్షపు నీరు నిలిచి పోవడంతో విపరీతంగా పెరిగిన దోమల లార్వాను గుర్తించారు. జీవీఎంసీ సిబ్బంది సాయంతో మందు చల్లించారు. ఆయిల్ బాల్స్ వేయాలని యాంటీ లార్వా సిబ్బందికి సూచించారు. అనంతరం రేసపువానిపాలెం, సీతంపేట, రెల్లివీధి ప్రాంతాల్లో నీటి నిల్వలను పరిశీలించారు. పువ్వుల కుండీలు, ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్సులు తనిఖీ చేశారు. దోమల లార్వాలను గుర్తించి వాటిని నాశనం చేయించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు మన్‌మోహన్, మలేరియా విభాగం సూపర్‌వైజర్లు రత్నంపుట్టి, సత్యానంద్, హెల్త్ అసిస్టెంట్లు కె.ఎస్.ఎస్.రెడ్డి, కోట్ని శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలన


ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలిస్తున్న ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ద్వితీయ సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్‌ను కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మంగళవారం వ్యాయామ విద్యా విభాగంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. త్వరలో తాను సైకాలజీ తరగతి తీసుకుంటానని తెలిపారు. పాస్ ఎలాంగ్ టెస్ట్, కైనెస్థీషియోమెట్రిక్ టెస్ట్, టాచిస్టోస్కోప్ టెస్ట్, ఫింగర్ డెక్స్‌టెరిటీ టెస్ట్, రియాక్షన్, రెస్పాండ్ టెస్ట్‌ల విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్, సైకాలజీ ఫ్యాకల్టీ జయరాం, వ్యాయామ విద్యా విభాగం పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోపుడు బళ్ల తొలగింపు అన్యాయం

దాబాగార్డెన్స్ : హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కళాభారతి రోడ్డులో గల తోపుడు బళ్లను తొలగించడం అన్యాయమని ప్రముఖ న్యాయవాది పలకా శ్రీరామమూర్తి అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కళాభారతి తోపుడు బండ్ల సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 నుంచి 40 ఏళ్లుగా చిరు వ్యాపారులు అక్కడ జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వానికి ఆశీలు కూడా కడుతున్నారని చెప్పారు. వారంతా లైసెన్స్ కలిగి ఉన్నారని, అయితే వీరంతా రోడ్డు మార్జిన్ ఆక్రమించారని ఆ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తెచ్చారని తెలిపారు. ఆ రోడ్డులో మార్జిన్ లేదన్నారు. లేని మార్జిన్‌కు 188 కోట్లు ఖర్చు చేసినట్టు జీవీఎంసీ పేర్కొందని, ఆ డబ్బులు ఏమయ్యాయని కోర్టులో పిటిషన్ వేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు ఈ అన్యాయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు బన్నీ మాట్లాడుతూ తాము తొలగించడం లేదని కార్పొరేటర్ మూర్తి, చిరువ్యాపారులు అద్దెకున్న ఇంటి యజమానులతో తమను బెదిరిస్తున్నారని వాపోయారు. సంఘం కార్యదర్శి నిసా మాట్లాడుతూ ఉద్యమానికి నాయకత్వం వహించ వద్దని, తనకు జాతీయ రహదారి పక్కన దుకాణం పెట్టిస్తానని మూర్తి ప్రలోభానికి గురి చేస్తున్నట్టు తెలిపారు. మూర్తిపై సర్వత్రా వ్యతిరేకత వస్తుండడంతో విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ భూకబ్జాలపై విచారణ చేయాలని మూర్తి ప్రకటన విడుదల చేశారని ఆమె ఎద్దేవా చేశారు. సమావేశంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలి

దాబాగార్డెన్స్: కాలానికి అనుగుణంగా నాయీ బ్రాహ్మణులు నానాటికీ కులవృత్తులు కోల్పోతున్నారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంబీసీ కార్పొరేషన్లో కలుపుతారని వచ్చిన సమాచారంతో నాయీ బ్రాహ్మణులు ఆవేదనతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఈ కులాలకు రాజకీయ అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ రెండు కులాలు ఎంబీసీలో విలీనమైతే ఇక రాజకీయ పదవులు కూడా రావన్నారు. ప్రస్తుతం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏ విధంగా నడుస్తుందో ఆ విధంగానే ఉంచి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బల్లంకి జగన్, తాడితూరి అప్పారావు, మల్లువలస రాదయ్య, బల్లంకి వెంకట్రావు, రాజాన రాముడు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్‌ఎఫ్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ. 2,500 మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కమాటి, ట్యూటర్, వాచ్‌మేన్, కుక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్, గ్రేస్ ప్రకాష్ కిరణ్, మధు, యేసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.